క్లుప్తంగా

నేడు బుడ్డా వెంగళరెడ్డి పుస్తక పరిచయ సభ

కడప సెవెన్‌రోడ్స్ : మహాదాత బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్ర పుస్తక పరిచయ సభ ఆదివారం ఉదయం 10.00 గంటలకు కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించనున్నట్లు రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు తెలిపారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.హరీంద్రనాథ్ అధ్యక్షత జరగనున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఆత్మీయ అతిథిగా శాసనమండలి సభ్యులు ఎంవీ రామచంద్రారెడ్డి పాల్గొంటారన్నారు. విశిష్ట అతిథులుగా బుడ్డా వెంగళరెడ్డి ఐదవ తరం వారసులు బుడ్డా విష్ణువర్దన్‌రెడ్డి, పుస్తక రచయిత కుమ్మరి దస్తగిరి హాజరవుతారన్నారు. వీరితోపాటు గౌరవ అతిథులుగా శ్రీ కోదండ రామాలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి, ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా అధ్యక్షులు మోపూరి బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొంటారని వివరించారు.

సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన

కడప ఎడ్యుకేషన్: కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా మూడవ రోజు శనివారం కడపలోని రైల్వేకాలనీ, మేరీనగర్‌లలో సాంకేతికత అక్షరాస్యతపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా డిజిటల్ ఫోన్ పే, యూట్యూబ్, ఇంటర్‌నెట్, సోషల్‌మీడియా, మొబైల్ ఇంటర్‌నెట్, డిజిటల్ పరికారాలు ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ చెప్పలి రాజారావు పాల్గొన్నారు.

యువత దేశాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

కడప ఎడ్యుకేషన్: యువత క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకుని భవిష్యత్తులో దేశాభివృద్ధికి తోడ్పాటునందించాలని యోగివేమన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ పుత్తాపద్మ పేర్కొన్నారు. కడప రిమ్స్‌రోడ్డులోని స్పిరిట్ డిగ్రీ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతోత్సవం, తృతీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ నేటి సాంకేతిక కాలంలో యువత కొత్త కోర్సులు నేర్చుకుని తమ జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ నిర్మల, డైరెక్టర్ రవీంద్ర మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రియాజుద్దీన్ పాల్గొన్నారు.

అన్నదానం



కడప కార్పొరేషన్: కడప నగర శివార్లలోని బ్రుంద వృద్ధాశ్రమంలో ది నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ చైర్మన్ ఎం.సురేష్ బాబు, జిల్లా చైర్మెన్ కిషోర్, ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా స్టేట్ చైర్మెన్ సురేష్ బాబు మాట్లాడుతూ కమిషన్ జాతీయ ఛైర్మెన్ డా. సాయి రమేష్ జన్మదిన సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: మెగా డీఎస్సీ ద్వారా ఎంపికై నూతన ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఏబి రామకృష్ణమరాజు కోరారు. ఈ విషయమై శనివారం డీఈఓ శంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ 2025 ద్వారా ఎంపికై సబ్జెక్టు ఖాళీలు లేని కారణంగా క్లస్టర్ ఉపాధ్యాయులుగా నియమించడం జరిగిందన్నారు. నూతన ఉత్సాహంతో విద్యాభివృద్ధికై కృషి చేయాలనే సంకల్పంతో ఉపాధ్యాయ ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టిన పాఠశాల సహాయకులను క్లస్టర్ ఉపాధ్యాయులుగా రోజుకో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తిప్పడం కాకుండా సబ్జెక్టు ఉపాధ్యాయులుగా ఉన్నత పాఠశాలలోనే ఉపయోగించుకుంటే విద్యావ్యవస్థకు మేలు జరుగుతుందన్నారు.

ఘనంగా దుర్భాక జయంతి

కడప ఎడ్యుకేషన్: స్వాతంత్ర్యోద్యమం కీలకదశలో ఉన్నపుడు రాజపుత్రవీరుడైన రాణాప్రతాపసింహ చరిత్రను కావ్యంగా రచించి తెలుగు వారిలో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని రగిలించిన కవిసార్వభౌముడు దుర్భాక రాజశేఖర శతావధాని అని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం దుర్భాక జయంతి నిర్వహించారు. సహాయ పరిశోధకులు డా. భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డా. చింతకుంట శివారెడ్డి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్య రంగాన్ని దెబ్బతీస్తున్న కూటమి ప్రభుత్వం

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో ప్రజలకు తీవ్ర నష్టం
- కోటి సంతకాల సేకరణలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష



కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: ప్రజారోగ్య రంగాన్ని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం దెబ్బతీస్తోందని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష విమర్శించారు. శనివారం 28వ డివిజన్‌లో శారదా నిలయం వద్ద ఆ డివిజన్ కార్పొరేటర్ అరీఫుల్లా బాషా ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి కోటి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా అంజద్‌బాష మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ వైద్య రంగాన్ని సువర్ణ అధ్యాయంగా మారిస్తే చంద్రబాబు ఆ కార్యక్రమాలను నీరుగారుస్తూ ఆరోగ్య భద్రత లేకుండా చేస్తున్నారన్నారు. ప్రతి జిల్లాకు ఒక బోధనాసుపత్రి ఉండాలన్న సంకల్పంతో తెచ్చిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తూ తన బినామీలకు, తన మనుషులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజా వైద్యం ప్రజల హక్కు అని, ప్రజల ఆస్తులు ఎప్పటికీ ప్రజలకే చెందాలన్నారు. రూ.8480 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 17 కొత్త మెడికల్ కాలేజీలు తేవడం జరిగిందని, చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త కాలేజీలను ఆపేయాలని కుట్ర పన్నుతున్నారన్నారు. కొత్త కాలేజీలు ఆపాలని నిర్మాణ సంస్థలకు లేఖలు రాశారన్నారు. ఆ తర్వాత 10 కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని నిర్ణయించారన్నారు. ఈ కాలేజీలు ప్రైవేటు పరం అయితే పేద, మధ్య తరగతి ప్రజలకు వైద్య విద్య, నాణ్యమైన వైద్యం దూరం అవుతాయన్నారు. ప్రైవేటు నియంత్రణ వల్ల వైద్య చికిత్సలు ఖరీదు అవుతాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరోగ్యశ్రీని పూర్తిగా దెబ్బతీశారని, దాదాపు రూ.3800కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉంచారన్నారు. ఆరోగ్య ఆసరా రద్దు చేశారని, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను రద్దు చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంత వరకూ వైఎస్సార్‌సీపీ నిరంతర పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్ఈసీ సభ్యులు మాసీమ బాబు, డా. సొహైల్, ఇన్‌చార్జి మేయర్ ముంతాజ్ బేగం, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాకా సురేష్, పార్టీ నాయకులు దాసరి శివప్రసాద్, జమాల్‌వలీ, దేవిరెడ్డి ఆదిత్య, షఫీ, షంషేర్, పవర్ అల్తాఫ్, జఫ్రుల్లా, రాజా, సలీం, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు చైతల్య, సుజిత, మల్లీశ్వరి, స్వర్ణలత, శ్వేతారెడ్డి, తులశమ్మ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలి



ఆర్‌డీఓ కార్యాలయం ఏఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పీఆర్ఎస్ వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని, ప్రభుత్వమే మెడికల్ కళాశాలలను నిర్వహించాలని పీఆర్ఎస్ వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెల్లూరు శంకర్ డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం కడప ఆర్‌డీఓ కార్యాలయం ఏఓ శంకర్‌రావును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంతో బడుగు, బలహీన, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయొద్దన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. రాష్ట్రంలోని బడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలో భాగంగా వైద్య విద్యను నిర్వీర్యం చేస్తూ, జీవో నెంబర్ 590 తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆలోచనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, జిల్లా నాయకులు ఓబుల్‌రెడ్డి, గణేష్, వరుణ్ కుమార్, శివభరత్ పాల్గొన్నారు.

రైతు బజార్ ఇన్‌చార్జి ఎస్టేట్ ఆఫీసర్‌గా రుచిత



కడప అగ్రికల్చర్: కడప బిజిఆర్ రైతుబజార్ ఇన్‌చార్జి ఎస్టేట్ ఆఫీసర్‌గా రుచిత శనివారం రైతుబజార్‌లోని తమ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో కడప రైతు బజార్‌లో ఎస్టేట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నాయక్‌ను పులివెందుల రైతుబజార్ ఇన్‌చార్జి ఎస్టేట్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. దీంతో అక్కడ పనిచేస్తున్న రుచితను కడప ఇన్‌చార్జి ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమించారు. దీంతో ఆమె కడప రైతబజార్‌కు వచ్చి బాధ్యతలను స్వీకరించారు.

పరిశుభ్రమైన గాలి కోసం కృషి చేయాలి



వైఎస్సార్ కాలనీలో మొక్కలు నాటుతున్న నగర పాలక అధికారులు, సిబ్బంది

కడప కార్పొరేషన్: పరిశుభ్రమైన గాలి మన ఆరోగ్యానికి ఆక్సిజన్ లాంటిదని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కడప నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ నెలలో క్లీన్ ఎయిర్ అనే థీమ్‌తో చలమారెడ్డిపల్లె స్కూల్, వైఎస్సార్ కాలనీలోని ఉర్దూ స్కూల్, ప్రకృతి నగర్‌లోని లలితాంబ టెంపుల్ వద్ద మొక్కలు నాటారు. పరిశుభ్రమైన గాలి ఆవశ్యకతను తెలుపుతూ వివిధ పాఠశాలల విద్యార్థులు ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెట్లు మనకు శుభ్రమైన గాలినిచ్చే సహజమైన వరమని, పర్యావరణాన్ని కాపాడితేనే స్వచ్ఛమైన గాలి పొందగలమన్నారు. వాయు కాలుష్యం పెరగడంతో స్వచ్ఛమైన గాలి తగ్గిపోతోందన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటితే స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు లభిస్తుందన్నారు. దీనివల్ల ఆరోగ్యకరమైన భవిష్యత్ మన సొంతమవుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, ఈఈ ధనలక్ష్మి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రవీంద్రనాథ్ రెడ్డి, మెప్మా , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోవాలి



కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

కడప ఎడ్యుకేషన్: పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా విద్యార్థులు తీసుకోవాలని ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు గోవిందరెడ్డి, షకీలాబేగంలు అన్నారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర – దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ఆవరణంలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు బీసీ భవన్‌లో సదస్సును జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జస్టిస్ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం కడప బీసీ భవన్ లో జరుగు సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గవాయిపై న్యాయవాది రాకేష్ కిషోర్ దాడి చేయడం న్యాయవ్యవస్థపై, ప్రజాస్వామ్యంపై, ప్రజల గొంతుకపై, రాజ్యాంగం పై దాడి చేయడమేనని అన్నారు. కడప పాత రిమ్స్ లోని బీసీ భవన్ లో జరుగనున్న సదస్సుకు హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ బ్రహ్మారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

పర్యావరణ సమతుల్యత మన బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ పుత్తాపద్మ

కడప ఎడ్యుకేషన్: పర్యావరణ సమతుల్యత మనందరి బాధ్యతని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర – దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం విశ్వవిద్యాలయంలో అధ్యాపకులు విద్యార్థులు క్లీన్ ఎయిర్ చైతన్య ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ఆచార్య పద్మ ప్రారంభించి మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్యతస్థాయి క్రమంగా పెరుగుతోందని దీన్ని తగ్గించే చర్యలు మనమంతా చేపట్టాలన్నారు. వాహనాల వినియోగం తగ్గించడం, విరివిగా మొక్కలు నాటడం చేయాలన్నారు. స్వర్ణ ఆంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర నోడల్ ఆఫీసర్ డా. కె లలిత నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. ఎన్ వెంకట్రామిరెడ్డి సమన్వయం చేశారు. ర్యాలీ పరిపాలన భవనం నుంచి మొదలై విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం వరకు చేరుకొని వేమన విగ్రహం వద్ద ఎన్ఎస్ఎస్ పి ఓ ఎస్.పి. వెంకటరమణ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని అన్ని ఎన్ఎస్ఎస్ యూనిట్ల పీవో డా. ఎస్. సునీత, ఆచార్యులు ఎస్.ఈశ్వర రెడ్డి, ఎ.మధుసూదనరెడ్డి, మాధవి, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ పాటించాలి



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కడప రిమ్స్ అడ్మినిస్ట్రేటర్ రంగస్వామి

కడప అర్బన్: కడప రిమ్స్ ఆవరణంలో ప్రతి ఒక్కరు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలని కడప రిమ్స్ అడ్మినిస్ట్రేటర్ రంగస్వామి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు ప్రతి నెల మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, ఇతర సంస్థలలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించాలని మార్గదర్శకాలను ఇప్పటికే నిర్దేశించారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని సూచించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమానికి సంబంధించిన ప్రతిజ్ఞను ఆయన చేయించారు. ర్యాలీగా వెళ్లారు.ఈ కార్యక్రమంలో జీజీహెచ్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది, పాల్గొన్నారు.

రక్తదానంతో యువత ఆదర్శంగా నిలవాలి



రక్తదానం చేస్తున్న యువకుడిని అభినందిస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ పుత్తా పద్మ తదితరులు



కోటిరెడ్డి - రామసుబ్బమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువకుడు

కడప ఎడ్యుకేషన్: రక్తదానంలో యువత అందరికి ఆదర్శంగా ఉండాలని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పుత్తా పద్మ అన్నారు. విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి, కడప రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో వై వి యు హెల్త్ సెంటర్లో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య పుత్తా పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వీ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి, హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ నరేష్ కుమార్ రెడ్డిలు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మ రక్తదానం చేసిన విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. రిమ్స్ బ్లడ్ బ్యాంక్ అధికారి డాక్టర్ రాజేందర్, నర్సింగ్ ఆఫీసర్లు సృజన, సుహాసిని, టెక్నీషియన్స్ ఆర్.ఎల్. నరసింహులు, చంద్రారెడ్డి, వసంత, సిబ్బంది పాల్గొన్నారు.

– రక్తదానం చేయడంతో యువత ముందుండాలని కోటిరెడ్డి రామసుబ్బమ్మ కుటుంబ సభ్యులు వివేకానంద రెడ్డి, రమ్యస్మిత అన్నారు. కడప నగరంలోని బృహదా బ్లడ్ బ్యాంక్‌లో కోటిరెడ్డి - రామసుబ్బమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హ్యాండ్ 4 యు స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోటిరెడ్డి రామసుబ్బమ్మ కుటుంబ సభ్యులు వివేకానంద రెడ్డి, రమ్యస్మిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువత మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని తెలిపారు. హ్యాండ్ 4 యు చైర్మన్ పట్టుపోగుల సుబ్బారావు వేల మందికి రక్తం అందించి ప్రాణాలు కాపాడారన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టెప్ జిల్లా మేనేజర్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సంఘీభావం



సదస్సులో పాల్గొన్న అతిథులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆశ, ఐసీడీఎస్, మిడ్ డే మీల్, గార్మెంట్ రంగాల్లోని శ్రమదోపిడికి గురవుతున్న మహిళా కార్మికుల ఆందోళనలకు బీమా, బ్యాంకింగ్, తదితర రంగాల్లోని మహిళా ఉద్యోగులు సంఘీభావంగా నిలువాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జోనల్ మాజీ ఉపాధ్యక్షులు ఎస్‌కే గీత పిలుపునిచ్చారు. స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయ ఆవరణలో శనివారం ఎల్ఐసీ యూనియన్ 14వ శ్రామిక మహిళా సదస్సు వై.శ్రీవాణి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సును ప్రారంభించిన ఎస్‌కే గీత మాట్లాడుతూ దేశంలో పెరిగిపోతున్న ఉపాధి కాంట్రాక్టీకరణ వల్ల ఆదాయాలు తగ్గి, పొదుపు మదుపు తగ్గి, బీమా రంగ సంస్థలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అందువల్ల ఈ శ్రమదోపిడికి గురవుతున్న రంగాల కార్మిక వర్గ పోరాటాలకు మనం సంఘీభావంగా నిలవాలని అన్నారు. గౌరవ అతిథి, ఏపీ రాష్ట్ర ఎల్ఐసి శ్రామిక మహిళా కన్వీనర్ జి.సూర్యప్రభ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధత ఇచ్చిన 13 గంటల పని విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. సదస్సులో యూనియన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్ మాట్లాడారు. మహిళలకు రక్షణ కవచమైన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ప్రభుత్వ బీమారంగాన్ని బలహీనత పరిచే ప్రయత్నాలను వ్యతిరేకించాలని సదస్సు తీర్మానించింది. కన్వీనర్ పి.వసుప్రద ప్రవేశపెట్టిన కార్యవర్గ నివేదికను సదస్సు ఆమోదించింది. ఎల్ఐసి శ్రామిక మహిళల విభాగం నిర్వహించిన వక్తృత పోటీల్లో విజేతలైన ఆర్ట్స్ కాలేజీ, కోటిరెడ్డి మహిళా కళాశాల విద్యార్థినులకు, వ్యాసరచన పోటీలో విజేతలైన మహిళా ఉద్యోగులకు సదస్సులో బహుమతులు అందజేశారు. సదస్సులో యూనియన్ ముఖ్యులు అక్బర్ బాషా, సూరిబాబు, వారిజాత మ్మ, పర్వీన్, లీలా లక్ష్మి, రాజు, అయ్యవారు రెడ్డి, కుమార్, రత్నకిషోర్ చిన్నయ్య సాదక్ పాల్గొన్నారు.


నూతన కార్యవర్గం

కన్వీనర్‌గా డి.శ్రీకృష్ణ (కడప), కో కన్వీనర్లుగాపి.వసుప్రద (కడప), వై. శ్రీవాణి (కడప), జి. పద్మజాలత (కడప), ఆర్కే లత (ఆదోని), కె.సుచిత్ర (ఆత్మకూరు), పి.లక్ష్మీదేవి (అనంతపురం–1), బీఎస్ వెంకట పృథ్వి (తాడిపత్రి)లను ఎన్నుకున్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా మల్లికార్జునరాజు ఎన్నిక

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కడప ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మల్లికార్జునరాజు ఎన్నికయ్యారు. ఇందుకు కడపజిల్లా నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన మల్లికార్జునరాజు మాట్లాడుతూ ఉద్యోగు సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు నెరవేరకుండా సమ్మె విరమణ శోచనీయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న స్ట్రగుల్ కమిటీ నాయకులు

కడప కార్పొరేషన్/ కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల ప్రధాన డిమాండ్లు నెరవేరకుండానే సమ్మె విరమణ శోచనీయమని స్ట్రగుల్ కమిటీ ఛైర్మెన్ పి. సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం యూనియన్ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్‌చేయడం, జేఎల్ఎం గ్రేడ్–2 సమస్యలు, పాత పెన్షన్ వర్తింపజేయాలని జేఏసీ సమ్మెకు పిలుపునిచ్చిందని, ఇవే అంశాల మీదే తాము అప్పటికే జిల్లాలలో డిస్కంల వద్ద, గత నెలలో విద్యుత్ సౌద వద్ద ధర్నా కూడా నిర్వహించడం జరిగిందన్నారు. జేఏసీ కూడా ఇవే డిమాండ్లతో సమ్మెకు పిలుపునివ్వడంతో స్ట్రగుల్ కమిటీగా తాము సమ్మెకు సిద్ధమయ్యామని, అయితే అవి నెరవేరకుండానే మధ్యలోనే జేఏసీ సమ్మె విరమించుకోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించడం వల్ల రూ.200 కోట్లు సంస్థకు మిగులుతుందన్నారు.

ఈ నిధులతో పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించవచ్చని తెలిపారు. కార్మిక ఉద్యోగులందరికీ కచ్చితంగా పెన్షన్ సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సంస్థను ప్రైవేటీకరణ వైపు తీసుకువెళ్లే విధానాలకు వెంటనే స్వస్తి పలకాలన్నారు. అప్పటి వరకూ సదస్సులు నిర్వహించుకుని ప్రధాన డిమాండ్స్ నెరవేరే వరకు దశల వారి ఆందోళనలకు సిద్ధమవుతామని వారు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాయబ్ రసూల్, డిస్కం అధ్యక్షుడు ఎస్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.